TELANGANA ADDA
RNI: TGTEL/25/A0986

# తెలంగాణ అడ్డా

తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం

PUBLISHED: KARIMNAGAR | సంపుటి : 02 | సంచిక : 52 | సోమవారం 07-09-2026 | ఎడిటర్ :- గడ్డి నరేష్, | పేజీలు : 04

## అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్

- భారీ ప్రజా ఉద్యమానికి పిలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కేసీఆర్ భారీ ఉద్యమం
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులపై నిర్లక్ష్యమే ప్రధాన కారణమన్న హరీశ్ రావు
- సీఎం రేవంత్ భాష వల్లే కేసీఆర్ సభకు రావట్లేదన్న వెల్లడి
- అసెంబ్లీ లోపల, బయట సర్కారును నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయం
- ముందు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్

2లో



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత



- కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్
- కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు
- కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ - మిగతా 2 లో

## మంత్రివర్గంలోకి మహేశ్ గౌడ్
## కొత్త పీసీసీ చీఫ్ ఎవరు?

- ఈ నెలాఖరులోగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం
- మంత్రివర్గంలోకి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ చేరిక దాదాపు ఖాయం
- కొత్త పీసీసీ చీఫ్ రేసులో పొన్నం ప్రభాకర్, బలరాం నాయక్ పేర్లు
- మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతల గట్టి ప్రయత్నాలు
- అసెంబ్లీ సమావేశాల తర్వాత ఢిల్లీలో అధిష్టానం తుది నిర్ణయం



తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెలాఖరులోగా - మిగతా 2 లో

## పీసీబీపై ఇమ్రాన్ ఖాన్ కుమారులు తీవ్ర విమర్శలు.. లార్డ్స్ టెస్టు వివాదంపై ఫైర్

- లార్డ్స్ టెస్టు వివాదంపై పీసీబీని తప్పుబట్టిన ఇమ్రాన్ ఖాన్ కుమారులు
- తమ ఇంటర్వ్యూ ప్రసారం ఆపాలని పీసీబీ బెదిరించిందన్న ఆరోపణ
- పీసీబీ తమను తాము ఫూల్స్‌గా మార్చుకుందని ఘాటు వ్యాఖ్య
- జైల్లో ఇమ్రాన్‌ను నెమ్మదిగా చంపేయాలని చూస్తున్నారన్న సంచలన ఆరోపణ
- తండ్రి ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన సులేమాన్, ఖాసిం



పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ కుమారులు సులేమాన్, ఖాసిం.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన లార్డ్స్ టెస్టు సందర్భంగా పీసీబీ వ్యవహరించిన తీరును తప్పుబడుతూ, వారు తమను తాము ఫూల్స్‌గా - మిగతా 2 లో

## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు

- విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం
- జకార్తాను కమ్మేసిన బూడిద మేఘాలు
- 300కు పైగా విమాన సర్వీసులు రద్దు
- వేలాది అడుగుల ఎత్తుకు ఎగిసిపడుతున్న బూడిద, ధూళి
- సునామీ ప్రమాదం లేదని స్పష్టం చేసిన ఇండోనేషియా అధికారులు
- బూడిద కారణంగా పలుచోట్ల పాఠశాలలకు సెలవులు, జనజీవనంపై ప్రభావం



ఇండోనేషియాలోని అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం మరోసారి బద్దలైంది. శుక్రవారం రాత్రి నుంచి ఉగ్రరూపం దాల్చిన ఈ అగ్నిపర్వతం - మిగతా 2 లో

## ధర్నాలు మాని అసెంబ్లీకి రండి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం




2లో

- బీఆర్ఎస్ నాయకత్వం దిశానిర్దేశం కోల్పోయిందన్న శ్రీధర్ బాబు
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని వెల్లడి
- బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శ

## 'దిమాగీ నక్సల్' పిల్ ఇచ్చా వాళ్లంతా బయటకొచ్చారు

- 'దిమాగీ నక్సల్' అనే హోమియోపతి మాత్రతో విమర్శకుల అసలు రంగు బయటపడిందన్న మోదీ
- గత ప్రభుత్వాల హయాంలోని వైఫల్యాలను విద్యార్థులకు వివరించిన ప్రధాని
- 2008 ఆర్థిక సంక్షోభం ఎదుర్కోవడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- కరోనా, యుద్ధం వంటి సంక్షోభాలను తన ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కొందని వెల్లడి
- భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ఆశలు నెరవేరడం లేదని వ్యాఖ్య

2లో



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విపక్ష నేతలపై మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. తాను గతంలో - మిగతా 2 లో

## ప్రైవేటీకరణ అంటూ కథనాలు క్లారిటీ ఇచ్చిన ఇస్రో



- ప్రైవేటీకరణ వార్తలను ఖండించిన భారత అంతరిక్ష సంస్థ
- మా పాత్ర తగ్గదు, మరింత కీలకమవుతుందని స్పష్టీకరణ
- అధునాతన పరిశోధనలపై దృష్టి పెడతామన్న ఇస్రో
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యం సామర్థ్యాన్ని పెంచడానికేనని వెల్లడి
- 2035 నాటికి భారతీయ అంతరిక్ష్ స్టేషన్ ఏర్పాటు లక్ష్యం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేటీకరిస్తున్నారంటూ గత కొద్ది - మిగతా 2 లో

## తిరుమలలో భక్తజన సంద్రం.. సర్వదర్శనానికి 24 గంటలు!



- వారాంతం కావడంతో తిరుమలకు పోటెత్తిన భక్తులు
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు
- శనివారం ఒక్కరోజే స్వామివారిని దర్శించుకున్న 84 వేల మంది భక్తులు
- నిన్న రూ.4.08 కోట్లుగా నమోదైన శ్రీవారి హుండీ ఆదాయం

తిరుమల పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. వారాంతపు - మిగతా 2 లో

## ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి



- టీడీపీ నేత వసంత్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి నారా లోకేశ్
- చిత్తూరు జిల్లా పెద్దకాల్వ గ్రామంలో లోకేశ్ పర్యటన
- వసంత్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు
- పార్టీకి ఆయన సేవలను గుర్తు చేసుకున్న లోకేశ్

కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ - మిగతా 2 లో

## పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట

- అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ.. ఉద్యోగులకు కీలక హామీలు
- గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం
- పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల విడుదలకు గ్రీన్ సిగ్నల్
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వెల్లడి
- ప్రభుత్వ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగ సంఘాల నేతలు

2లో



రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ ఊరట కల్పించారు. గత ప్రభుత్వం రద్దు చేసిన 'అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్'ను పునరుద్ధరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ సంఘాలతో శనివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు. దీనితో పాటు ఉద్యోగులు ఎదురుచూస్తున్న పలు పెండింగ్ సమస్యల పరిష్కారానికి కూడా ముఖ్యమంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూనే, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
సోమవారం 07-09-2026

## డీజీపీని ఉద్దేశిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

మొదటిపేజీ తరువాయి – చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, “డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?” అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## మంత్రివర్గంలోకి మహేశ్ గౌడ్.. కొత్త పీసీసీ చీఫ్ ఎవరు?

మొదటిపేజీ తరువాయి – కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించి, ఖాళీగా ఉన్న మూడు బెర్తులను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విస్తరణలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు మంత్రివర్గంలో స్థానం కల్పించడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. మహేశ్ గౌడ్ రెండేళ్ల పీసీసీ అధ్యక్ష పదవీకాలం ఈ నెల 15తో ముగియనుండటంతో, ఆయనను కేబినెట్‌లోకి తీసుకుని పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించాలని అధిష్ఠానం యోచిస్తోంది. కొత్త పీసీసీ చీఫ్ రేసులో మంత్రి పొన్నం ప్రభాకర్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. మరోవైపు, మంత్రి పదవుల కోసం పలువురు సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నాయని చర్చ నడుస్తోంది. సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ విజయశాంతి, మహిళా కోటాలో నలమాద పద్మావతీ రెడ్డి కూడా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఎన్నికల హామీ మేరకు తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే కోరుతున్నారు. అయితే ఆయన సోదరుడు వెంకటరెడ్డి ఇప్పటికే మంత్రిగా ఉండటంతో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆసక్తి నెలకొంది. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కాంగ్రెస్ అధిష్ఠానం తుది విడత చర్చలు జరపనుంది. ఆయన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది జాబితాను ఖరారు చేయనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ గౌడ్‌లను కూడా ఢిల్లీకి పిలిపించి మాట్లాడనున్నట్లు తెలుస్తోంది.

## ధర్నాలు మాని అసెంబ్లీకి రండి.. సమాధానం చెప్పేందుకు మేం సిద్ధం

మొదటిపేజీ తరువాయి – తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకత్వం పూర్తిగా దిశానిర్దేశం కోల్పోయి పక్కదారి పడుతోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. రోడ్లపై అనవసర ధర్నాలు, మీడియా ముందు మాట్లాడటం మాని నేరుగా అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తాము ప్రతీదానికీ సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత జవాబుదారీతనంతో పనిచేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నిలబెట్టుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వలేకపోయారని, కానీ తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ రేషన్ కార్డులతో పాటు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తోందని గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళల ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని బీఆర్ఎస్, బీజేపీ నేతల కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకోవడం లేదా? అని శ్రీధర్‌బాబు నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీలు కావాలనే కాంగ్రెస్‌పై విషం చిమ్ముతున్నాయని, ఈ దుష్ప్రచారాన్ని తెలంగాణ ప్రజలు తిప్పి కొడతారని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని హితవు పలికారు. రేవంత్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కేటీఆర్, హరీశ్‌రావులు.. గతంలో వారి ప్రభుత్వ హయాంలో ఇవే హామీలపై కేసీఆర్‌ను ఎందుకు ప్రశ్నించలేకపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా వైఖరి మార్చుకోకపోతే, భవిష్యత్తులోనూ వీధుల్లోనే మిగిలిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ఇండోనేషియాలో అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలు

మొదటిపేజీ తరువాయి – నుంచి వెలువడుతున్న బూడిద, ధూళి మేఘాల కారణంగా రాజధాని జకార్తాలో విమాన సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందుజాగ్రత్త చర్యగా సోకర్నో-హట్టా అంతర్జాతీయ విమానాశ్రయంలో 300కు పైగా విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జావా, సుమత్రా దీవుల మధ్య ఉన్న ఈ అగ్నిపర్వతం నుంచి వెలువడిన బూడిద ఆదివారం ఉదయం జకార్తా విమానాశ్రయ పరిసరాలను కమ్మేసింది. దీంతో అధికారులు తొలుత ఉదయం 9:30 గంటల వరకు, ఆ తర్వాత సాయంత్రం 5:30 గంటల వరకు విమాన రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 301 విమానాలను రద్దు చేయగా, వాటిలో 58 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. ఈ పరిణామంతో 22,000 మందికి పైగా ప్రయాణికులపై ప్రభావం పడింది. సింగపూర్ ఎయిర్‌లైన్స్, మలేషియా ఎయిర్‌లైన్స్ వంటి సంస్థలు జకార్తాకు తమ సర్వీసులను రద్దు చేసుకున్నాయి. సింగపూర్, దోహా, సిడ్నీ, కౌలాలంపూర్ వంటి ప్రధాన మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. అగ్నిపర్వతం నుంచి బూడిద మేఘాలు జావా వైపు 20,000 అడుగులు, సుమత్రా వైపు 50,000 అడుగుల ఎత్తు వరకు వ్యాపించాయి. నిరంతర భూ ప్రకంపనలు, లావా వెదజల్లడం, భారీ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతోంది. బూడిద కారణంగా కంటికి సంబంధించిన సమస్యలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మత్స్యకారులు కూడా సముద్రంలోకి వేటకు వెళ్లలేదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు, కళ్లజోళ్లు తప్పనిసరిగా ధరించాలని ఇండోనేషియా విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. ప్రస్తుతానికి సునామీ ముప్పు ఏదీ లేదని అధికారులు స్పష్టం చేసినప్పటికీ, ప్రజల్లో ఆందోళన నెలకొంది. 2018లో ఇదే అగ్నిపర్వతం విస్ఫోటనం కారణంగా సంభవించిన సునామీలో 400 మందికి పైగా మరణించారు. పసిఫిక్ ‘రింగ్ ఆఫ్ ఫైర్’ ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ అగ్నిపర్వతాలు, భూకంపాలు సంభవించడం సాధారణమే.

## తిరుమలలో భక్తజన సంద్రం.. సర్వదర్శనానికి 24 గంటలు!



మొదటిపేజీ తరువాయి – సెలవుల నేపథ్యంలో శ్రీవారి దర్శనార్థం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు కాంప్లెక్స్ వెలుపలికి విస్తరించి బాట గంగమ్మ ఆలయం వరకు చేరుకున్నాయి. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి దర్శనానికి గంటల తరబడి సమయం పడుతోంది. ఆదివారం ఉదయం 8 గంటల తర్వాత సర్వదర్శనం క్యూలైన్లలో ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం లభించేందుకు సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. అదేవిధంగా, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 4 నుంచి 6 గంటలు, సర్వదర్శనం టోకెన్లు పొందిన భక్తులకు 5 నుంచి 7 గంటల సమయం పడుతుందని వివరించారు. తిరుమలలో నెలకొన్న రద్దీ తీవ్రతను శనివారం నాటి గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నిన్న ఒక్కరోజే మొత్తం 84,166 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 36,673 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి రూ.4.08 కోట్ల ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీకి అనుగుణంగా టిటిడి అధికారులు 4.74 లక్షల లడ్డూలను విక్రయించారు.

# అసెంబ్లీ సమావేశాల తర్వాత రోడ్డెక్కనున్న కేసీఆర్

మొదటిపేజీ తరువాయి – ప్రత్యక్ష పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ సిద్ధమైంది. సోమవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల తర్వాత, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించనున్నారని పార్టీ ప్రకటించింది. ఆదివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. సమావేశం అనంతరం వివరాలను అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాకు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నీటిని ఎత్తిపోయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వం 80 శాతం పూర్తి చేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మిగిలిన పనులు పూర్తిచేస్తే 60 టీఎంసీల నీరు అందుబాటులోకి వస్తుందని, కానీ కాంగ్రెస్ సర్కారు కక్షపూరితంగా దాన్ని పక్కనపెట్టిందని విమర్శించారు. “ఈ రెండు ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా, రాబోయే రోజుల్లో స్వయంగా కేసీఆర్ లక్షలాది మందితో ప్రత్యక్ష ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించాం” అని హరీశ్ రావు తెలిపారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీస్తామని హరీశ్ రావు స్పష్టం చేశారు. సెక్షన్ 22ఏ కింద భూములను ‘నిషేధిత జాబితా’లో చేర్చి రైతులను వేధించడం, విద్యుత్ కోతలు, రుణమాఫీ వైఫల్యం, పాలిటెక్నిక్ జీవో 97 రద్దు, సింగరేణి కుంభకోణాలు, పీఆర్సీ, డీఏలు, ఈహెచ్ఎస్ అమలులో వైఫల్యాలపై ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తామన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ హాజరుకాకపోవడంపై కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను హరీశ్ రావు తిప్పికొట్టారు. “ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాడే వీధి స్థాయి భాషను వినడానికి కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిన అవసరం లేదు” అని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ఎన్టీఆర్, జయలలిత, చంద్రబాబు వంటి నేతలు శాసనసభలో అవమానాలకు గురైనప్పుడు సభను బహిష్కరించి, ప్రజా తీర్పుతో తిరిగి ముఖ్యమంత్రులుగా వచ్చారని, కేసీఆర్ కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేత భద్రత ఖర్చుపై మాట్లాడే సీఎం రేవంత్ రెడ్డి, కనీసం వార్డు మెంబర్‌గా కూడా లేని తన సోదరుడు తిరుపతి రెడ్డికి నలుగురు గన్‌మెన్లను పెట్టి రూ.40 కోట్లు ఖర్చు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశాన్ని కూడా సభలో ప్రస్తావిస్తామన్నారు. ప్రజా సమస్యలపై సమగ్ర చర్చకు వీలుగా అసెంబ్లీ సమావేశాలను నెల రోజుల పాటు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ రాజీనామా చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై స్పందిస్తూ.. ‘ఆరు గ్యారెంటీలు’, రుణమాఫీ హామీని నిలబెట్టుకోనందుకు ముందుగా సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పాలన చేతగాక, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతోనే.. కేసీఆర్ రాజీనామా అంశాన్ని తెరపైకి తెచ్చి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలన పూర్తి చేసుకున్నా.. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు, దళిత, గిరిజన, బీసీ వర్గాలను దారుణంగా మోసం చేసిందని విమర్శించారు.

# పీసీబీపై ఇమ్రాన్ ఖాన్ కుమారుల తీవ్ర విమర్శలు లార్డ్స్ టెస్టు వివాదంపై ఫైర్

మొదటిపేజీ తరువాయి – మార్చుకున్నారని ఘాటుగా విమర్శించారు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టు మొదటి రోజు, స్కై స్పోర్ట్స్ ఛానెల్‌లో ఇమ్రాన్ కుమారులు సులేమాన్, ఖాసింల ఇంటర్వ్యూ ప్రసారమైంది. మాజీ ఇంగ్లండ్ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో, వారు జైల్లో ఉన్న తమ తండ్రి క్షీణిస్తున్న ఆరోగ్యం, జైలు పరిస్థితులపై మాట్లాడారు. ఈ ఇంటర్వ్యూ ప్రసారాన్ని నిలిపివేయకపోతే లంచ్ విరామం తర్వాత బరిలోకి దిగబోమని పీసీబీ బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వివాదంపైనే ఇమ్రాన్ కుమారులు స్పందించారు. “వారు (పీసీబీ) తమను తాము పూర్తిగా ఫూల్స్‌గా మార్చుకున్నారు” అని ఖాసిం వ్యాఖ్యానించారు. పీసీబీ స్పందన చూసి షాక్‌కు గురయ్యానని సులేమాన్ అన్నారు. “మా ఇంటర్వ్యూను తొలగించాలని పీసీబీ కోరడం వారి పరిధిలో లేదు. మేం మాట్లాడింది రాజకీయాల గురించి కాదు, మానవతా దృక్పథంతో ఆయన ఆరోగ్యం గురించే” అని సులేమాన్ వివరించారు. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ, పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో, ఇమ్రాన్ భద్రతపై ఆయన కుమారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. “జైల్లోనే ఆయన్ను చంపేయాలని వారు స్పష్టంగా చూస్తున్నారు. వీలైనంత రహస్యంగా ఆయన్ను నిశ్శబ్దం చేసి, నెమ్మదిగా కనుమరుగు చేయాలని ప్రయత్నిస్తున్నారు” అని వారు సంచలన ఆరోపణలు చేశారు. అయితే, ఇమ్రాన్ ఖాన్‌కు పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నామని, ఆయనపై దుష్ప్రవర్తన ఆరోపణలను పాకిస్థాన్ అధికారులు ఖండిస్తూ వస్తున్నారు. ఈ వాదనలను సులేమాన్ తోసిపుచ్చారు. “ప్రభుత్వ వర్గాలు చెప్పే మాటల్లో పారదర్శకత లేదు. మాకు ఎలాంటి ఆధారాలు చూపించడం లేదు. అలాంటప్పుడు మేం ఎలా నమ్మాలి? ఆరు నెలల క్రితం తన కంటి సమస్య గురించి ఆయనే స్వయంగా మాట్లాడారు. ఆ తర్వాత ఆయన ఆరోగ్యంపై మాకు ఎలాంటి స్పష్టమైన సమాచారం లేదు” అని సులేమాన్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రైవేటీకరణ అంటూ కథనాలు.. క్లారిటీ ఇచ్చిన ఇస్రో



మొదటిపేజీ తరువాయి – రోజులుగా మీడియాలో వస్తున్న ఊహాగానాలకు సంస్థ ఆదివారం పూర్తిస్థాయిలో తెరదించింది. ఇస్రోను ప్రైవేటీకరించే ఆలోచన లేదని, దేశ అంతరిక్ష ప్రయోగాలలో దాని ప్రాధాన్యం ఎప్పటికీ తగ్గదని స్పష్టం చేసింది. ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. ఇస్రో భవిష్యత్ పాత్రపై కొన్ని మీడియా సంస్థలు అసత్యాలు, తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని, ఈ కథనాలు పూర్తిగా నిరాధారమైనవని ఇస్రో పేర్కొంది. “ఇస్రోను ప్రైవేటీకరించరు, దాని ప్రాముఖ్యాన్ని తగ్గించరు. అత్యాధునిక అంతరిక్ష పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, వ్యూహాత్మక ప్రయోగాలు, అంతరిక్ష విజ్ఞానం, అన్వేషణ వంటి కీలక రంగాలలో ఇస్రో దేశానికి ప్రధాన సంస్థగా కొనసాగుతుంది” అని ఆ ప్రకటనలో తేల్చిచెప్పింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వెనుక ఉద్దేశం ఇస్రో పాత్రను తగ్గించడం కాదని, మరింత ఉన్నతమైన లక్ష్యాలపై దృష్టి సారించేలా చేయడమేనని వివరించింది. 2020లో ప్రారంభమైన సంస్కరణలు, 2023 భారత అంతరిక్ష విధానం ద్వారా దేశంలో బలమైన, ప్రపంచంతో పోటీపడగల అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని తెలిపింది. దీనివల్ల ఇస్రో ప్రాధాన్యం తగ్గదని, భారత అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ స్వరూపం, సామర్థ్యం విస్తరిస్తాయని పేర్కొంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన, పునరావృతమయ్యే పనులను పరిశ్రమలకు అప్పగించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది తమ సమయాన్ని అధునాతన పరిశోధనలు (ఆర్ అండ్ డీ), కొత్త తరం టెక్నాలజీలు, సంక్లిష్టమైన జాతీయ ప్రాజెక్టులపై కేంద్రీకరించగలరని ఇస్రో తెలిపింది. ఇది “ఇస్రో నేతృత్వంలోని జాతీయ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ”కు నాంది పలుకుతుందని వివరించింది.

**భవిష్యత్ లక్ష్యాలు ఇవే..**

భవిష్యత్తులో ఇస్రో పాత్ర మరింత బలోపేతం కానుంది. ముఖ్యంగా, మానవసహిత అంతరిక్ష యాత్రలు (గగన్‌యాన్), కొత్త తరం ప్రయోగ వాహనాలు, చంద్రుడు, ఇతర గ్రహాలపై పరిశోధనలు, 2035 నాటికి ‘భారతీయ అంతరిక్ష్ స్టేషన్’ ఏర్పాటు, 2040 నాటికి చంద్రుడిపైకి భారతీయుడిని పంపడం వంటి భారీ లక్ష్యాలపై ఇస్రో దృష్టి పెడుతుంది. ప్రస్తుతం 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి 44 బిలియన్ డాలర్లకు పెంచడమే లక్ష్యం. ఈ స్థాయి వృద్ధిని కేవలం ప్రభుత్వ వనరులతో సాధించడం అసాధ్యమని, దీనికి ప్రైవేట్ పెట్టుబడులు, పారిశ్రామిక సామర్థ్యం, ప్రపంచ మార్కెట్ అవసరమని ఇస్రో స్పష్టం చేసింది. 2020లో కొన్ని మాత్రమే ఉన్న స్పేస్ స్టార్టప్‌లు, నేడు 450కి పైగా పెరగడమే ఈ సంస్కరణల విజయానికి నిదర్శనమని పేర్కొంది.

# ‘దిమాగీ నక్సల్’ పిల్ ఇచ్చా.. వాళ్లంతా బయటకొచ్చారు

మొదటిపేజీ తరువాయి – ప్రయోగించిన ‘దిమాగీ నక్సల్’ పదాన్ని పునరుద్ఘాటిస్తూ, అది ఒక హోమియోపతి మాత్రలా పనిచేసి విమర్శకుల అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని వ్యాఖ్యానించారు. నిన్న ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, తన ప్రభుత్వ పాలనను, గత ప్రభుత్వాల పనితీరును పోల్చి చూపిస్తూ పదునైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. “ఎర్రకోట నుంచి నేను చేసిన ప్రసంగం మీరు విని ఉండొచ్చు. నేను ఎర్రకోట నుంచి ‘దిమాగీ నక్సల్’ అనే ఒక హోమియోపతి పిల్ ఇచ్చాను. హోమియోపతి సూత్రాల ప్రకారం, చికిత్స ప్రారంభించినప్పుడు మొదట్లో వ్యాధి మరింత తీవ్రమవుతుంది. అదే హోమియోపతి స్వభావం” అని వివరించారు. “అదేవిధంగా, నేను ‘దిమాగీ నక్సల్’ పిల్ ఇవ్వగానే, దిమాగీ నక్సల్స్ ఒక్కొక్కరుగా బయటకు రావడం మొదలుపెట్టారు. ఈ వ్యాధిని ప్రోత్సహిస్తున్న వారి అసలు రంగును ఇప్పుడు ప్రజలు కూడా చూస్తున్నారు” అని అన్నారు. గతంలో దేశం ఎదుర్కొన్న సంక్షోభాలను నాటి ప్రభుత్వాలు ఎదుర్కొన్న తీరును ప్రధాని తీవ్రంగా విమర్శించారు. “నేను మీకు చాలా విషయాలు చెప్పాను. ‘ఇదేంటి? ఇది 140 కోట్ల మంది ప్రజలున్న దేశం. ఇది చాలా సులభం. మోదీ కొత్తగా ఏం చేశారు?’ అని కొందరు అనుకోవచ్చు. కానీ అది నిజంగా అంత సులభమా? నేను మిమ్మల్ని మరోసారి పాత రోజుల్లోకి తీసుకెళ్లాలనుకుంటున్నాను” అని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. 2013 నాటి కేదార్‌నాథ్ విపత్తును ప్రస్తావిస్తూ.. “అప్పుడు యావత్ ప్రభుత్వం కకావికలమైంది. ఏం చేయాలో, ఎలా స్పందించాలో వారికి తెలియలేదు” అని గుర్తుచేశారు. అదేవిధంగా 2008లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కూడా అప్పటి ప్రభుత్వం సమర్థంగా ఎదుర్కోలేకపోయిందని విమర్శించారు. “2008లో బ్యాంకింగ్ సంక్షోభం వచ్చినప్పుడు, నాటి ప్రభుత్వం ఏళ్ల తరబడి ఆ సంక్షోభం చాటున దాక్కునే ప్రయత్నం చేసింది. దాన్ని ఎదుర్కొనే ధైర్యం కూడా వారికి లేదు. భారతదేశ మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ పతనం అంచుకు నెట్టబడింది” అని ఆయన పేర్కొన్నారు. తన ప్రభుత్వం ఎదుర్కొన్న సవాళ్లను వివరిస్తూ, వాటిని ఎలా ధైర్యంగా ఎదుర్కొన్నారో మోదీ వివరించారు. “మొదట ప్రపంచాన్ని స్తంభింపజేసిన కోవిడ్-19 మహమ్మారి వచ్చింది. ఆ తర్వాత రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైంది. వాణిజ్యం, సరఫరా గొలుసులు ఆయుధాలుగా మారాయి. పశ్చిమాసియాలో సంక్షోభం తలెత్తింది. ప్రతీసారి ‘ఇక భారత్ నిలబడదు’ అని అన్నారు. నన్ను నా అతిపెద్ద ఆరాధకులు (విమర్శకులు) అయితే ‘ఇప్పుడు మోదీ చిక్కుకున్నాడు, పడిపోయాడు, ఇక అతన్ని అణిచివేస్తారు’ అని సంతోషించారు. కానీ, నా దేశ ప్రజల ఆశీర్వాదాలకు ఎంత శక్తి ఉందంటే, భారత్ విఫలం కావాలని కోరుకునే వారి ప్రతి కోరిక నెరవేరడం లేదు” అని మోదీ వ్యాఖ్యానించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా మోదీ ఎస్ఆర్‌సీసీని సందర్శించారు. అప్పుడు విద్యార్థులను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగం 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇప్పుడు ప్రధాని హోదాలో అదే వేదికపై నుంచి ప్రసంగించడం గమనార్హం.

## పెన్షనర్లకు చంద్రబాబు భారీ ఊరట

మొదటిపేజీ తరువాయి – 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ అందనుంది. ఉద్యోగుల చిరకాల డిమాండ్ అయిన 12వ పే-రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుకు కూడా సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న 4 డీఏలలో రెండింటిని విడుదల చేయడానికి అంగీకరించారు. 1-7-2024, 1-1-2025 తేదీలకు చెందిన ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసులకు ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరాకే చెల్లించేందుకు సుముఖత చూపారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్ఎస్)ను క్రమబద్ధీకరించి, వచ్చే నెల నుంచే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుంది.


**గత పాలనలో ఉద్యోగులకు అవమానాలు: సీఎం చంద్రబాబు**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, “మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు... పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం.

## ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి







మొదటిపేజీ తరువాయి – వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్ కుమార్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ గ్రామంలోని వసంత్ కుమార్ నివాసానికి వెళ్లిన లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి లోకేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన లోకేశ్, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం
సోమవారం 07-09-2026

## గుండ్లపల్లి--పొత్తూరు డబుల్ రోడ్డుకు ఆమోదం.. పనుల ప్రారంభంపై ఎదురుచూపులు

**గన్నేరువరం ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్న ప్రజల డిమాండ్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సమాచారం. సుమారు 21 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధికి రూ.71 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు గతంలో వార్తలు వెలువడ్డాయి. ఈ రహదారి డబుల్ రోడ్డుగా అభివృద్ధి చెందితే గుండ్లపల్లి, గన్నేరువరం, పొత్తూరు పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ప్రస్తుతం రహదారిపై వాహనాల రాకపోకలు పెరగడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కూడా తగ్గే అవకాశం ఉంది. అయితే ఆమోదం తర్వాత పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి? పనుల ప్రస్తుత స్థితి ఏమిటి? అనే అంశాలపై స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. రహదారి నిర్మాణానికి సంబంధించిన తదుపరి కార్యాచరణను అధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే కవంపల్లి సత్యనారాయణ రహదారి పనుల పురోగతిపై తాజా వివరాలను వెల్లడిస్తే ప్రజలకు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌కు పరిష్కారం దిశగా అడుగులు పడుతున్న నేపథ్యంలో.. డబుల్ రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయన్నదే ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

## రాష్ట్రంలో విద్యుత్ రంగానికి పెద్దపీట: ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** ప్రజాభవన్‌లో రాష్ట్ర విద్యుత్ శాఖ అధికారులతో ఉన్నతాధికారులతో ఒక సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి ఆటంకం కలగకుండా థర్మల్ కేంద్రాలకు నిరంతర బొగ్గు సరఫరా, ఒడిశాలోని నైనీ గని నుంచి రవాణా ఏర్పాట్లను అత్యంత పకడ్బందీగా చేపట్టాలని ఈ సమావేశంలో అధికారులను ఆదేశించారు. విద్యుత్ సంస్థల ఆర్థిక బలోపేతానికి ఇంధన, ఆర్థిక శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వ్యవసాయం, పరిశ్రమలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణాభివృద్ధి రంగాల నుంచి పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలిక ఇంధన ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రజలందరికీ నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, సింగరేణి కాలరీస్ మరియు జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల సీఎండీలు, డైరెక్టర్లు మరియు ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధానంగా బొగ్గు రవాణా భద్రత, థర్మల్ విద్యుత్ కేంద్రాల పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యం, డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా వ్యూహాలు, మరియు విద్యుత్ సంస్థల ఆర్థిక పునరుద్ధరణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## రామడుగు మండలం దేశారాజ్ పల్లిలో నూతన గ్రామపంచాయతీ, కుల సంఘ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం



**చొప్పదండి ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం దేశారాజ్ పల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, అలాగే విశ్వబ్రాహ్మణ కుల సంఘ భవన నిర్మాణానికి చొప్పదండి శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి కావలసిన అభివృద్ధి పనులపై స్థానిక ప్రజలతో మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడమే లక్ష్యంగా ముందుకు వెళు_న్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగానికి సిద్ధమవుతున్న యువతకు సువర్ణావకాశం: ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్




**భూపాలపల్లి ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** భూపాలపల్లి జిల్లా యువత కోసం ఏర్పాటు చేసిన ఉచిత డేస్ స్కాలర్ శిక్షణలో భాగంగా సెప్టెంబర్ 6, 2026న జిల్లా పోలీస్ కార్యాలయంలో శారీరక పరీక్షలు నిర్వహించగా, జిల్లావ్యాప్తంగా సుమారు 350 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం సింగరేణి హైస్కూల్‌లో రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ స్వయంగా పరిశీలించి అభ్యర్థులతో మాట్లాడారు. అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శారీరక, రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఉచిత డేస్ స్కాలర్ క్లాసులతో పాటు గ్రౌండ్ కోచింగ్‌ను 70 రోజుల పాటు అందించనున్నట్లు తెలిపారు. యువత కష్టపడి చదివి, శారీరకంగా సిద్ధమై పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## హుస్సేన్ సాగర్ తీరంలో ఘనంగా తెలంగాణ గంగా తెప్పోత్సవం




**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** ట్యాంక్ బండ్ వద్ద హుస్సేన్ సాగర్ తీరంలో తెలంగాణ గంగా తెప్పోత్సవం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకంగా గంగా హారతి స్వీకరించినట్లు వెల్లడించారు. ఈ వేడుకకు మహిళలు, గంగపుత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూర్తిగా సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ గంగా హారతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో అంగరంగ వైభవంగా సాగింది. తెలంగాణలోని మత్స్యకారులు, గంగపుత్రుల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలను గౌరవిస్తూ వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. హుస్సేన్ సాగర్ తీరంలో జరిగిన గంగా తెప్పోత్సవం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సముచిత ప్రతీకగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. గంగపుత్రుల సంక్షేమం, మత్స్యకారుల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. గంగా మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

## యువ సమరభేరి విజేతతో బీజేపీ, కాంగ్రెస్‌లలో భయం మొదలైంది: బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్




**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** కరీంనగర్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన విద్యార్థి, యువ సమరభేరి సభ అపూర్వ విజయాన్ని సాధించడంతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో భయం మొదలైందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ అన్నారు. సభ సక్సెస్ కాలేదంటూ మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడటం బీజేపీ పార్టీ భయానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రెండుసార్లు ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. నగరపాలక సంస్థలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా కేంద్రం నుంచి ఒక్క రూపాయి నిధులు తీసుకురాకుండా, కేవలం జనరల్ ఫండ్స్‌తో ప్రారంభోత్సవాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఏళ్లు గడుస్తున్నా రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేయకపోవడమే బండి సంజయ్ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. మరోవైపు నగరంలో పారిశుధ్యం పడకేసిందని, మేయర్‌గా కోలగాని శ్రీనివాస్ పూర్తిగా విఫలమయ్యారని, అధికారులపై ఆయనకు నియంత్రణ లేదని విమర్శించారు. నగర సమస్యలపై సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు , షేక్ యూసుఫ్, మాజీ కార్పొరేటర్లు గందె మాధవి- మహేష్, నందెల్లి రమాదేవి, దిండిగాల మహేష్, కంసాల శ్రీనివాస్, ఎడ్ల అశోక్, బోనాల శ్రీకాంత్, నాంపల్లి శ్రీనివాస్, నక్క కృష్ణ, జక్కని ఉమాపతి, నాయకులు గడ్డం ప్రశాంత్ రెడ్డి, సుంకిశాల సంపత్ రావు, నేతి రవివర్మ, గంగాధర చందు, పటేల్ సుధీర్ రెడ్డి, నారదాసు వసంతరావు, అరె రవి, తౌంటి రాజేందర్, ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి, నయీమ్, చేతి చంద్రశేఖర్, మంతిని కిరణ్, పిట్టల శ్రీనివాస్, మిడిదొడ్డి నవీన్, చొక్కారపు చంద్రం, మేచినేని పవన్, మహిళా నాయకురాళ్లు కంజర్ల రేణుక, గంటల రేణుక తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం ఈశ్వర్ సాయి మోసం చేశాడంటూ



**సెప్టెంబర్ 06 తెలంగాణ అడ్డా:** ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం కలకలం రేపింది. ఈశ్వర్ సాయిపై ఫిర్యాదు చేసినా అరెస్ట్ చేయకపోవడంతో మనస్తాపానికి గురైన మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ క్రమంలోనే.. డోర్ పగలగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న మాధురి రాథోడ్‌ను కుటుంబ సభ్యులు కాపాడారు.ఫోక్ డాన్సర్ మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం కలకలం రేపింది. ఈశ్వర్ సాయిపై ఫిర్యాదు చేసినా అరెస్ట్ చేయకపోవడంతో మనస్తాపానికి గురైన మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ క్రమంలోనే.. డోర్ పగలగొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న మాధురి రాథోడ్‌ను కుటుంబ సభ్యులు కాపాడారు. పెళ్లి చేసుకుంటానని ఈశ్వర్ సాయి మోసం చేయడంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసినట్లు కుటుంబసభ్యులుపేర్కొంటున్నారు. నార్సింగి పోలీసులు డాన్సర్ ఈశ్వర్ సాయిని తప్పించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ మాధురి రాథోడ్ ఆరోపిస్తున్నారు.ఫోక్ సాంగ్ డ్యాన్సర్లు ఈశ్వర్ సాయి, మాధురి రాథోడ్ వివాదం గత కొంతకాలం నుంచి కొనసాగుతున్న విషయం తెలిసిందే.. వీరిద్దరూ రూమ్ లో ఉండగా.. ఈశ్వర్ సాయి భార్య పట్టుకున్న విషయం తెలిసిందే.. ఆ తర్వాత వీరికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈ వివాదంపై ఈశ్వర్ సాయి తన తప్పు లేదని కప్పిపుచ్చుకునే ప్రయత్నాలు చేయగా.. ఈశ్వర్ తనను పెళ్లిపేరుతో మోసం చేశాడని మాధురి రాథోడ్ ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలోనే.. డ్యాన్సర్ మాధురి రాథోడ్ తనకు న్యాయం జరగడంలేదంటూ.. ఆత్మహత్యాయత్నం చేసినట్లు సమాచారం.. తన ఇంట్లో.. ఫ్యాన్ కు ఉరి వేసుకోగా.. డోర్ పగలగొట్టి మాధురిని కుటుంబ సభ్యులు కాపాడారు. ఈశ్వర్ సాయిపై పోలీసులకు కంప్లైంట్ చేసినా పట్టించుకోవడంలేదని.. అందుకే.. ఆత్మహత్యాయత్నం చేసినట్లుగా మాధురి ఆరోపించడం సంచలనంగా మారింది.

## మంగంపేటలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ బాకీ కార్డుల పంపిణీ



**జిన్నారం మండల ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** జిన్నారం మండలంలోని మంగంపేట గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు, అమలు చేసిన విధానాలను ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిన్నారం మున్సిపాలిటీ చైర్మన్ జనార్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు జిన్నారం బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నాయకోటి రాజేష్, మండల నాయకులు, మంగంపేట గ్రామ బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ వెళ్లి బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాచబోయిన మల్లేశం, రూపెరావు నరేందర్, మాజీ ఉపసర్పంచ్ నక్క నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు మాచబోయిన శ్రీశైలం, పంబల రతన్ కుమార్, కత్తుల నవీన్ కుమార్, నాయకోటి లక్ష్మణ్, మాచబోయిన శ్రీకాంత్, నక్క అఖిలేశ్, నక్క సందీప్, జిల్ల మల్లేశ్, కుమ్మరి నరేష్, ముస్తఫా రంజిత్ కుమార్, పంబల బాలకృష్ణతో పాటు గ్రామ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మాచబోయిన శ్రీశైలం ఏర్పాటు చేసిన తేనీటి విందులో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ ఇచ్చిన పిలుపును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

## కరీంనగర్ జిల్లా మొదటి ట్యాక్వాండో చాంపియన్షిప్ పోటీలకు విశిష్ట అతిథిగా హాజరైన 'అల్ఫోర్స్' నరేందర్ రెడ్డి



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలగడంతోపాటు యువతలో స్నేహబంధాలు బలపడటానికి ఇవి గొప్ప వేదికగా నిలుస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కొనియాడారు. స్థానిక కరీంనగర్‌లోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రప్రథమ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన విశిష్ట అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లాలో క్రీడలను మరింత అభివృద్ధి చేయడానికి అందరూ ప్రత్యేక చొరవ తీసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడలకు చేయూతనివ్వడం మనందరి ప్రాథమిక బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం. గోపాల్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్ రెడ్డి, జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి శ్రీనివాస్ గౌడ్, వివిధ సంఘాల ప్రతినిధులు డాక్టర్ కృష్ణ చైతన్య, అరవింద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం మున్సిపల్‌లో కాంగ్రెస్ 420 హామీల బాకీ కార్డుల పంపిణీ

### ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

### జిన్నారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



**జిన్నారం ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** జిన్నారం మున్సిపల్ పరిధిలోని నల్తూర్, కొడకంచి, ఉట్ల, దాదిగూడెం, మంగంపేట, జంగంపేట గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించిన 420 బాకీ కార్డులను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజలకు వాస్తవ పరిస్థితిని తెలియజేస్తూ ఇంటింటికీ బాకీ కార్డులు పంపిణీ చేసి నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని, హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్దన్, సీనియర్ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నాయకోటి రాజేష్, కౌన్సిలర్లు పూజారి రాజు, నాగరాజు, బత్తుల మహేష్, ఆది రామకృష్ణ, శంకరప్ప, శివరాజు, శ్రీశైలం, మల్లేశం, నరేందర్, గోవిందరాజు, రాజు, కృష్ణ, భీమ్రావు, కుమార్, వెంకటేష్, భాస్కర్, సాయి గౌడ్, నాగరాజు, వీరేష్, బిక్షపతి, మల్లేష్, మహేష్, విష్ణు, శ్రీకాంత్, సత్యనారాయణతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో RI అడ్మిన్ కిరణ్ కుమార్ సస్పెండ్.. డ్యూటీల కేటాయింపులో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలపై వేటు



**జగిత్యాల ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** జగిత్యాల పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ (=×) అడ్మిన్ కిరణ్ కుమార్‌పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. గత కొంతకాలంగా సిబ్బందికి డ్యూటీల కేటాయింపు విషయంలో ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా, కొంతమంది సిబ్బందికి డ్యూటీలు కేటాయించకుండా వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే తీవ్ర ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో, విచారణ జరిపిన అనంతరం చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కిరణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం ఉన్నతాధికారులు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

## జగిత్యాలలో ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

### ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన అబ్దుల్ జమీల్



**జగిత్యాల బ్యూరో / తెలంగాణ అడ్డా:** జగిత్యాల జిల్లా కేంద్రంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యా రంగంలో విశేష సేవలందించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీఆర్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు, జెడ్పీహెచ్ఎస్ నూకపల్లి స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) అబ్దుల్ జమీల్.. జగిత్యాల శాసనసభ్యులు (ఎమ్మెల్యే) శ్రీ డాక్టర్ సంజయ్ కుమార్ గారి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరియు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. విద్యాబోధనలో ఆయన ప్రతిభను, విద్యార్థుల భవిష్యత్తు కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత అబ్దుల్ జమీల్‌కు తోటి ఉపాధ్యాయులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## సిద్దిపేటలో వరుస ఆలయ దొంగతనాల నిందితుడు అరెస్ట్.. సొత్తు స్వాధీనం



**సిద్దిపేట బ్యూరో / తెలంగాణ అడ్డా:** సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస ఆలయ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడు ఏ. సుదర్శన్ (35)ను పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి ఒక సుజుకి అవెనిస్ స్కూటర్, చోరీకి గురైన విలువైన ఆలయ గంటలు, అలాగే తాళాలు పగలగొట్టేందుకు ఉపయోగించిన రెంచ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే రూరల్ ఎస్ఐ నవత మరియు పోలీస్ సిబ్బందితో కూడిన మొత్తం బృందం అప్రమత్తమై వేగంగా స్పందించింది. నిందితుడి కదలికలను పసిగట్టి త్వరితగతిన అరెస్ట్ చేయడం పట్ల స్థానికులు, భక్తులు పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ప్రజల భద్రత కోసం, ఆస్తుల పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న పోలీసుల పనితీరుపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

TELANGANA ADDA RNI: TGTEL/25/A0986
తెలంగాణ అడ్డా
తెలుగు దినపత్రిక
ప్రజా సమస్యే మా ఆయుధం



# దిల్లీ సత్య నికేతన్‌లో కూలిన బహుళ అంతస్తుల భవనం.. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్న వైనం

**ఢిల్లీ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** దిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం సమీపంలోని రద్దీ ప్రాంతమైన సత్య నికేతన్‌లో భారీ భవనం కుప్పకూలిన ఘోర ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. విద్యార్థులు ఉండేందుకు అనువుగా ఉన్న ఒక బహుళ అంతస్తుల భవనం ఒక్కసారిగా పేకమేడలా కుప్పకూలడంతో పలువురు విద్యార్థులు శిథిలాల కింద చిక్కుకున్నారు.

**ప్రమాదం ఎలా జరిగింది?**

భవనం కింది భాగంలో నేల మాళిగలో ఎలాంటి సరైన అనుమతులు లేకుండా అంతర్గత నిర్మాణం మరియు త్రవ్వకాల పనులు జరిగాయి. ఈ పనుల కారణంగా పిల్లర్లు బలహీనపడటంతో భవనం భారాన్ని మోయలేక ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. మధ్యాహ్న సమయం కావడంతో భవనంలో ఉన్న విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో చిక్కుకుపోయారు.

**ప్రాణనష్టం మరియు క్షతగాత్రుల వివరాలు:** ఈ దుర్ఘటనలో శిథిలాల కింద చిక్కుకుని ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన పలువురు విద్యార్థులను అత్యవసరంగా సమీపంలోని ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. కొందరు విద్యార్థులు శిథిలాల కింద నుంచి తమ చరవాణుల ద్వారా కుటుంబ సభ్యులకు, రెస్క్యూ సిబ్బందికి సమాచారం అందించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు.

**సహాయక చర్యలు:** ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, దిల్లీ పోలీసులు మరియు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టారు. ప్రత్యేక కుక్కల (డాగ్ స్క్వాడ్) సహాయంతో శిథిలాలను తొలగిస్తూ లోపల చిక్కుకున్న వారిని రక్షించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ రక్షణ చర్యల్లో భాగంగా జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం బృందాలకు స్థానికులు, యువజన సంఘాల ప్రతినిధులు సైతం చేదోడు వాదోడుగా నిలిచి సహాయక చర్యల్లో భాగస్వామ్యులయ్యారు. ఇరుకైన ప్రాంతం కావడంతో భారీ యంత్రాలను తీసుకురావడంలో ఇబ్బందులు తలెత్తినప్పటికీ, ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా రక్షణ దళాలు రేయింబవళ్లు శ్రమిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా త్రవ్వకాలు చేపట్టిన భవన యజమానిపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట.. ప్రజాభవన్‌లో ఈహెచ్ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులతో ఉన్నతస్థాయి సమీక్ష



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ఈహెచ్ఎస్ ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఉన్నతాధికారులతో ఒక ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య భద్రత, వారి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఈహెచ్ఎస్ అమలు విషయంలో ఎలాంటి రాజీ ఉండే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఉద్యోగులు మరియు వారి కుటుంబాల సంక్షేమాన్ని మాత్రమే దృష్టిలో ఉంచుకుని మానవీయ దృక్పథంతో ఈ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 354 ఆసుపత్రులు అందుబాటులో ఉండగా, ఉద్యోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మరిన్ని ఆసుపత్రులను ఎంప్యానెల్ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ఉద్యోగులందరికీ హెల్త్ కార్డుల జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఈ సందర్భంగా అధికారులను ప్రత్యేకంగా ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మల్లు భట్టి విక్రమార్క గారు పునరుద్ఘాటించారు.

## మెట్రో - ఆర్టీసీ సంయుక్త పాస్ తక్షణమే ప్రవేశపెట్టాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జూజు




**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** హైదరాబాద్ నగరంలో మెట్రో రైలు మరియు ఆర్టీసీ బస్సు ప్రయాణానికి సంబంధించి ఉమ్మడి (జాయింట్) పాస్‌ను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జూజు అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నెలవారీ (మంత్లీ), రోజువారీ (డైలీ) పాస్‌లను జారీ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బేగంపేట మెట్రో రైల్ భవన్‌లో హెచ్ఎంఆర్ఎల్, టీజీఎస్ఆర్టీసీ విద్యుత్ శాఖ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అధికారులతో సీఎస్ సమగ్ర సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెట్రో రైలు మొదటి, రెండవ దశల పురోగతిపై హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ బి.అజిత్ రెడ్డి, జాయింట్ ఎండీ శివేంద్ర ప్రతాప్ తదితరులు వివరాలు అందజేశారు. పాతబస్తీ మెట్రో కారిడార్ విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డు వెడల్పు పనుల ప్రస్తుత పరిస్థితిని సీఎస్ ఆరా తీశారు. జనరల్ కన్సల్టెంట్ నియామక టెండర్ ప్రక్రియ గురించి అధికారులు వివరించగా.. 7.5 కిలోమీటర్ల పాతబస్తీ కారిడార్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని, మెట్రో ప్రాజెక్ట్ కార్యకలాపాలను వేగంగా ప్రారంభించాలని సీఎస్ ఆదేశించారు. మెట్రో - ఆర్టీసీ ప్రయాణికుల కోసం సంయుక్త పాస్‌ను జారీ చేసేందుకు తాము సాంకేతికంగా పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, ఎప్పుడైనా అమలు చేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామని ఎల్ అండ్ టీ మెట్రో, ఆర్టీసీ అధికారులు తెలిపారు. సంయుక్త చార్జీల విధానాన్ని త్వరగా ఖరారు చేసి వెంటనే పాస్ వ్యవస్థను అమలు చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి, మెట్రో రైలు చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ డి.వి.ఎస్. రాజు, సీఎస్‌టీఈ స్వప్న కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, జీఎం (ఫైనాన్స్) సూర్యప్రకాష్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెట్రోలో ప్రయాణించిన చీఫ్ సెక్రటరీ: ఈ సమావేశానికి ముందు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జూజు.. ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ బి.అజిత్ రెడ్డితో కలిసి బేగంపేట నుంచి ప్యారడైజ్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ప్రయాణ సమయంలో స్టేషన్లలోని వాణిజ్య సముదాయాలు, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి వాటి మరింత అభివృద్ధికి పలు సూచనలు చేశారు. అలాగే, ఎన్‌హెచ్-44 పై హెచ్ఎండీఏ నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లను కూడా ఆయన పరిశీలించారు.

## కొనరావుపేటలో ఘనంగా వాలీబాల్ ప్రీమియర్ లీగ్--3 ప్లేయర్స్ ఆక్షన్



**కొనరావుపేట, తెలంగాణ అడ్డా ప్రతినిధి:** కోనరావుపేట మండల కేంద్రంలో వాలీబాల్ ప్రీమియర్ లీగ్--3 ప్లేయర్స్ ఆక్షన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల ప్రెసిడెంట్ ధర్మేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆక్షన్‌లో పలువురు వాలీబాల్ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా జట్ల నిర్వాహకులు తమకు నచ్చిన ప్రతిభావంతులైన క్రీడాకారులను ఆక్షన్ ద్వారా ఎంపిక చేసుకున్నారు. వాలీబాల్ క్రీడకు యువతలో మరింత ఆదరణ పెంచడంతో పాటు, స్థానిక క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో లీగ్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆక్షన్ సందర్భంగా క్రీడాకారుల ఎంపికలో ఉత్కంఠ నెలకొనగా, ప్రతి జట్టు తమకు అనుకూలమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకుంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పవన్, కార్యదర్శి సృజనతో పాటు మైకల్, ప్రశాంత్, ప్రణయ్, బిక్షపతి, మహేష్, వేణు, సాజిత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు, క్రీడాకారుల సహకారంతో వాలీబాల్ ప్రీమియర్ లీగ్--3 ప్లేయర్స్ ఆక్షన్ విజయవంతంగా పూర్తయింది

## జగదాంబ దేవి ఆలయ అభివృద్ధికి భారీ విరాళం

భూక్యా బాలు నాయక్ ఔదార్యం
ఆలయ కమిటీకి ?65,000 నగదు అందజేత
ఆలయ పునర్నిర్మాణానికి తనవంతు సాయమన్న బాలు నాయక్
'అమ్మవారి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి'
గ్రామీణ దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపు



**వీర్నపల్లి/సిరిసిల్ల (తెలంగాణ అడ్డా):** స్థానిక భావుసింగ్ నాయక్ తండా, గోనా నాయక్ తండా, గోలియ నాయక్ తండా పరిధిలో ఉన్న శ్రీ జగదాంబ దేవి ఆలయ అభివృద్ధికి తండాకు చెందిన ప్రముఖుడు భూక్యా బాలు నాయక్ భారీ విరాళాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో ఆయన శనివారం ?65,000 నగదును ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా బాలు నాయక్ మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ పునర్నిర్మాణానికి, అలాగే ఆలయం ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు బాధ్యతగా ఈ చిన్న సహాయం చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, తండా వాసులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హామీలపై 'బాకీ కార్డులు' పంపిణీ

నిమ్మపెల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన



**కోనరావుపేట, తెలంగాణ అడ్డా ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. కోనరావుపేట మండలం నిమ్మపెల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గ్యారెంటీ కార్డులకు బదులుగా 'కాంగ్రెస్ బాకీ కార్డులు' ప్రజలకు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రజలకు ఈ కార్డులను అందజేశారు.రైతులకు రూ.500 బోనస్, మహిళలకు పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, కళ్యాణలక్ష్మి--షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం, ఉపాధి కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందుకు గ్యారెంటీ కార్డులు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును విస్మరిస్తున్నారని వారు మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు జరిగే వరకు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంగల్ తిరుపతి గౌడ్, పల్లె గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్ర దేవయ్య, మాజీ సర్పంచ్ కదిరి శ్రీనివాస్, నల్ల గోవర్ధన్, ఉపసర్పంచ్ దొంతరవాణి శ్రీనివాస్ గౌడ్తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పబ్‌లో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తమ్ముడి హంగామా.. అద్దాలు ధ్వంసం, ఇద్దరికి తీవ్ర గాయాలు

**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కారాకారా పబ్‌లో అర్ధరాత్రి భారీ గొడవ జరిగింది. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తమ్ముడు ఫుల్లుగా తాగి పబ్‌లో హంగామా సృష్టించారు. తమ టేబుల్ మీకు ఎందుకు ఇవ్వాలని వేరే కస్టమర్ ప్రశ్నించడంతో వివాదం చెలరేగి పబ్‌లో తీవ్ర విధ్వంసానికి దారితీసింది. ఈ వివాదం ముదరడంతో రెండు గ్రూపులుగా విడిపోయిన సుమారు 150 మంది పరస్పరం దాడికి పాల్పడ్డారు. ఈ ఘర్షణలో పబ్ అద్దాలు, తలుపులు, కిటికీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆటో కార్మికుల సంక్షేమ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్‌లో బీఆర్ఎస్ భారీ ఆటో నిరసన ర్యాలీ




**మహబూబ్ నగర్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని మండిపడుతూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. మెట్టుగడ్డ నుంచి క్లాక్ టవర్ మీదుగా తెలంగాణ చౌరస్తా వరకు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు మరియు ఆటో కార్మికులు కలిసి ఈ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12,000 ఆర్థిక సహాయం అందించాలని, వారి కుటుంబాల సంక్షేమం కోసం ప్రత్యేకంగా 'ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు' ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఇతర వృత్తిదారుల మాదిరిగానే ఆటో కార్మికులకు కూడా ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పెద్దెత్తున నినాదాలు చేశారు. కార్మికుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటం ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

## త్వరలో కేసీఆర్ పాదయాత్ర.. లక్ష మంది రైతులతో కలిసి కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుల సందర్శన

బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో కేసీఆర్



**హైదరాబాద్ బ్యూరో / తెలంగాణ అడ్డా:** రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు, ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేసేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే తాను స్వయంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈ పాదయాత్రలో భాగంగా లక్ష మంది రైతులతో కలిసి రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక ప్రాజెక్టులైన కాళేశ్వరం మరియు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను సందర్శించనున్నట్లు కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సాగునీటి రంగానికి జరుగుతున్న నష్టాన్ని, ప్రాజెక్టుల నిర్లక్ష్యాన్ని రైతులక్ష్యంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. త్వరలోనే ఈ పాదయాత్రకు సంబంధించి పూర్తి విధివిధానాలు, కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## అసెంబ్లీ ప్రాంగణంలో ప్రభుత్వ విప్ కార్యాలయం ప్రారంభం.. విజయరమణ రావుకు ప్రముఖుల శుభాకాంక్షలు



**పెద్దపల్లి ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుకు ప్రభుత్వం తరఫున తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో అధికారిక కార్యాలయం కేటాయించారు. ఈ కార్యవిధ్యాన్ని ఆదివారం వేద పండితుల సమక్షంలో మంత్రోత్సవాలతో ఆయన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్ రావు తదితర ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారందరూ ప్రభుత్వ విప్ విజయరమణ రావును శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

## అల్ఫోర్స్ వైస్ అడ్మినిస్ట్రేటర్ ప్రణీత కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ వి. నరేందర్ రెడ్డి



**కరీంనగర్ ప్రతినిధి / తెలంగాణ అడ్డా:** కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మెయిన్ క్యాంపస్ వైస్ అడ్మినిస్ట్రేటర్ ప్రణీత భర్త ఎం. రఘునందన్ రావు ఆకస్మిక మరణం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వివిఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మరియు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భర్తను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న ప్రణీత కుటుంబాన్ని నేరుగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుఃఖ సమయంలో బాధిత కుటుంబానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల తరఫున ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు, అన్ని విధాలుగా అండగా ఉంటామని నరేందర్ రెడ్డి భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## కాంగ్రెస్ హామీలపై 'బాకీ కార్డులు' పంపిణీ

వట్టిమల్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న నిరసన




**కోనరావుపేట, తెలంగాణ అడ్డా ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. కోనరావుపేట మండలం వట్టిమల్లలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల గ్యారెంటీ కార్డులకు బదులుగా 'కాంగ్రెస్ బాకీ కార్డులు' ప్రజలకు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ ప్రజలకు ఈ కార్డులను అందజేశారు. రైతులకు రూ.500 బోనస్, మహిళలకు పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, కళ్యాణలక్ష్మి--షాదీముబారక్ పథకాల కింద తులం బంగారం, ఉపాధి కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రస్తుతం రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించేందుకు గ్యారెంటీ కార్డులు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల అమలును విస్మరిస్తున్నారని వారు మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు జరిగే వరకు ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ సంపత్, మాజీ సర్పంచ్ తిరుపతి, వార్డు సభ్యులు రఘు, సాయి, మరియు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మల్లేశం, రమేష్, శేషు, కమలాకర్, దేవరాజ్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITOR, PUBLISHER, OWNER BYGADDI NARESH Published at D.No: 3-82, Rathnampeta, Vilasagar, Rajanna Sirisilla, Karimnagar District, Telangana State pin—505524. Printer Sanam Venkata Rajasekhar, Printed at Arunodaya Printers D.No : 33-5-9, 2nd floor, , Papaiah Street, Seetharamapuram , Vijayawada, Krishna District, Andhra Pradesh pin-52002 Email Telanganadhairyamnewspaper@gmail.com, Cell :9441260616. RNI No: TGTEL/25/A0986